
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# పాలన భేష్



అమృతమ్మ, సర్పంచ్

పాండురంగారెడ్డి మాజీ సర్పంచ్

## జాతీయ స్థాయి అవార్డుతో మెరిసిన మోత్కుపల్లి

## గుడ్ గవర్నెన్స్‌విభాగంలో గ్రామ పంచాయతీకి అరుదైన గౌరవం

## దేశానికే దిక్సూచిగా నిలిచిన పల్లెసీమ

**కోట్పల్లి, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** 'పల్లె సీమలే దేశానికి పట్టుకొమ్మలు' అన్న మాటను నిజం చేస్తూ తెలంగాణలోని గ్రామాలు దేశానికే దిక్సూచిగా నిలుస్తున్నాయి. వికారాబాద్ జిల్లా కోట్పల్లి మండల పరిధిలోని మోత్కుపల్లి గ్రామ పంచాయతీ జాతీయ స్థాయిలో సత్తా చాటింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలలో భాగంగా గుడ్ గవర్నెన్స్ (ఉత్తమ పరిపాలన) విభాగంలో మోత్కుపల్లి జాతీయ స్థాయి అవార్డును కైవసం చేసుకుంది.

**తెలంగాణ గడ్డపై కొత్త రికార్డు**

2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఈ పురస్కారాల్లో తెలంగాణ రాష్ట్రం నుండి కేవలం రెండు గ్రామాలు మాత్రమే ఎంపికయ్యాయి. అందులో మోత్కుపల్లి గుడ్ గవర్నెన్స్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి సరికొత్త రికార్డు సృష్టించగా, సంగారెడ్డి జిల్లాలోని ఫసల్వాడి గ్రామం విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా అవార్డును దక్కించుకుంది. పారదర్శకమైన పాలన, ప్రజల భాగస్వామ్యం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో చూపిన విశిష్ట ప్రతిభకు ఈ గుర్తింపు లభించింది.

**అభివృద్ధి పథంలో ఆదర్శంగా..**

మోత్కుపల్లి గ్రామంలో మౌలిక వసతుల కల్పనలో రాజీ లేని కృషి జరిగింది. దీంతోపాటు ఇంటి పన్నుల వసూలు, ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నిర్వహణలో పక్కాగా వ్యవహరించారు.

**మౌలిక సదుపాయాలు ఇలా..** గ్రామంలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, వైకుంఠధామం (శ్మశానవాటిక), క్రీడా ప్రాంగణం వంటి పనులు పూర్తి చేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, స్వచ్ఛమైన తాగునీటి సదుపాయం కల్పించారు.

**డిజిటల్ సేవలు:** గ్రామంలో డిజిటల్ సేవలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారు.

**పారదర్శక పాలనకు దక్కిన గౌరవం : ఎంపిడివో**

జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేందర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పారదర్శక పాలనకు దక్కిన గౌరవం ఇదని, ఇది భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులకు ప్రేరణగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ బైండ్ల అమృతమ్మ నారాయణ, మాజీ సర్పంచ్ పి. పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. కష్టానికి తగిన గుర్తింపు లభించిందన్నారు. గ్రామాన్ని అగ్రగామిగా నిలిపిన ప్రజలకు, అధికారులకు అభినందనలు తెలిపారు. ఈ అవార్డు రావడంతో కోట్పల్లి మండలంతో పాటు వికారాబాద్ జిల్లా పేరు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది.



మోత్కుపల్లి గ్రామంలో అభివృద్ధి పనుల దృశ్యం

## మైనింగ్ అక్రమాలపై వరుస దాడులు

### 'వార్త' కథనాలకు స్పందించిన పోలీసులు

### అక్రమార్కుల ఆటకట్టించటంలో కదలని మైనింగ్ అధికారులు

**పెద్దేముల్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** అనుమతులు లేకుండా సహజ సంపదను దోచేస్తున్న అక్రమార్కులపై పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. కోట్లాది రూపాయలు ఖజానాకు గండి కొడుతూ స్థానికంగా ఉన్న అసైన్డ్ భూములలో తవ్వకాలు జరుపుతున్న వైనాన్ని ఇటీవల వార్త వరుస కథనాలతో వెలుగులోకి తీసుకువచ్చిన సంగతి విదితమే. అటు మైనింగ్ ఇటు పోలీస్, రెవెన్యూ శాఖలు సమిష్టిగా కదిలితేనే అక్రమార్కుల ఆటకట్టించే అవకాశం ఉంటుంది. ఇక్కడి పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. ప్రభుత్వ సంపదను కంటికి రెప్పలా కాపాడాల్సిన కొంతమంది మొద్దు నిద్రలో ఉండటంతో మైనింగ్ మాఫియాకు ఆడింది ఆటగా మారింది. పోలీసులు మాత్రం తమ వంతుగా ఎర్రమట్టిని తరలిస్తున్న వాహనాలను అదుపులోకి తీసుకుని తమ పరిధిలో చర్యలు తీసుకుంటున్నారు. ఎద్దేముల్ మండలం పాషపూర్ శివారులో అనుమతి పత్రాలు లేకుండా బుధవారం ఎర్రరాయి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కల్తీ కేటుగాళ్లు



విషపూరిత ఐస్ క్రీంలను సీజ్ చేసిన దృశ్యం

## పరిగిలో ప్రజల ప్రాణాలతో చెలగాటం!

### టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడుల్లో వెలుగుచూసిన దారుణాలు

### కుళ్లిన మాంసం, విషపూరిత ఐస్‌క్రీమ్ కేంద్రాల సీజ్..

### నలుగురు అరెస్ట్: తప్పు చేస్తే తాట తీస్తాం : ఎస్పీ వార్నింగ్



కుళ్లిన మాంసాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

**పరిగి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** అక్రమాలకు పాల్పడి సామాన్య ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకునే కేటుగాళ్లపై వికారాబాద్ పోలీసులు కొరడా ఝుళిపించారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు, బుధవారం పరిగి పట్టణంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు జరిపిన మెరుపు దాడులు ఒక్కసారిగా కలకలం రేపాయి.

**అక్రమ సంపాదనపై ఉన్న మక్కువ, సామాన్య ప్రజల ఆరోగ్యంపై లేకపోవడంతో పరిగి పట్టణంలో కల్తీ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. రంగురంగుల ఐస్‌క్రీమ్‌ల వెనుక రసాయనాల విషాన్ని, రుచికరమైన మాంసం పేరిట కుళ్లిన వ్యర్థాలను విక్రయిస్తూ అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాలతో రంగంలోకి దిగిన టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తెల్లవారుజాము నుంచే పరిగిలోని పలు కేంద్రాలపై మెరుపు దాడులు నిర్వహించి, ఈ విస్తుపోయే వాస్తవాలను బయటపెట్టారు. ముఖ్యంగా చిన్నపిల్లలు ఎంతో ఇష్టంగా తినే ఐస్‌క్రీమ్‌ల తయారీలో పారిశ్రామిక అవసరాలకు వాడే ప్రమాదకర రంగులను, గడువు ముగిసిన ముడిసరుకులను వాడుతున్న తీరు అధికారులనే విస్మయానికి గురిచేసింది.**

ఈ సోదాల్లో నివ్వెరపోయే నిజాలు వెలుగుచూశాయి. కుళ్లిన మాంసం విక్రయాలు, రసాయన రంగులతో ఐస్‌క్రీమ్‌ల తయారీ మరియు అక్రమ గ్యాస్ సిలిండర్ల దందా నిర్వహిస్తున్న కేంద్రాలపై అధికారులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు.

విషపూరిత ఐస్‌క్రీమ్‌లు.. రసాయన రంగుల మాయాజాలం

పరిగి ప్రధాన రహదారిపై ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీనిత్య ఐస్‌క్రీమ్ యూనిట్‌పై పోలీసులు దాడి చేశారు. గడువు ముగిసిన ముడిసరుకులు, ప్రమాదకరమైన పారిశ్రామిక రంగులను ఉపయోగించి ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అక్కడి నుండి పెద్ద మొత్తంలో కల్తీ సామాగ్రిని స్వాధీనం చేసుకుని, నిర్వాహకుడు వర్కల హన్మంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా, సిద్ధార్థ కాలనీలో కె. రమేష్ అనే వ్యక్తి తయారీ, గడువు తేదీలు లేకుండా మహా ఐస్‌క్రీమ్ పేరుతో ఐస్‌క్రీమ్‌లు తయారు చేస్తూ పట్టుబడ్డారు.

**35 కిలోల కుళ్లిన మాంసం సీజ్**

నాణ్యమైన మాంసం అందించాల్సిన మటన్ షాపుల్లో దారుణాలు సాగుతున్నాయి. విద్యానగర్ కాలనీకి చెందిన మహ్మద్ ఖలీల్ తన మటన్ షాపులో సుమారు 35 కిలోల కుళ్లిన మాంసాన్ని నిల్వ ఉంచి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించి, దానిని సీజ్ చేశారు. పాత మాంసాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్న ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

**అక్రమ గ్యాస్ సిలిండర్ల స్వాధీనం**

అదే కాలనీలో అక్రమంగా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచిన కృష్ణ అనే వ్యక్తి నివాసంపై దాడి చేసిన అధికారులు, 5 సబ్సిడీ, 3 కమర్షియల్ నిండు సిలిండర్లతో పాటు 4 ఖాళీ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు.

ఎస్పీ హెచ్చరిక: చట్టపరమైన చర్యలు తప్పవుపట్టుబడ్డ నిందితులందరిపై పరిగి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ స్నేహ మెహ్రా వెల్లడించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని, చట్టవిరుద్ధ కార్యక్రమాలకు పాల్పడే వ్యక్తులపై కఠినమైన శిక్షలు ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె. అన్వర్ పాషా మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



చౌడాపూర్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ దీపక్ తివారి

## ప్రతి విద్యార్థికి సబ్జెక్టుపై పట్టు ఉండాల్సిందే

### టీచర్లకు కలెక్టర్ సీరియస్ వార్నింగ్

### పథకాల అమలు తీరుపై ఆకస్మిక తనిఖీ

**చౌడాపూర్, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అన్ని సబ్జెక్టులపై పూర్తి అవగాహన ఉండాలని, పదవ తరగతి పరీక్షల దృష్ట్యా బోధనలో మరింత పదును పెంచాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో ఆయన ఆకస్మికంగా పర్యటించి పాఠశాలలు, అంగన్వాడీలు, ప్రభుత్వ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**క్లాస్ రూమ్‌లో కలెక్టర్..**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, అక్కడ జరుగుతున్న భౌతిక శాస్త్రం (ఫిజిక్స్) ప్రత్యేక తరగతులను పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులకు ముఖ్యమైన ప్రశ్నలపై తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను ప్రాక్టీస్ చేయిస్తూ, విద్యార్థుల నుండి సమాధానాలు రాబట్టే విధంగా విద్యాబోధన సాగాలని ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**సంక్షేమ పథకాలపై ఆరా..**

పాఠశాల పర్యటన అనంతరం కలెక్టర్ పలు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతను తనిఖీ చేశారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన వంటశాల, మరుగుదొడ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షి ంచాలని సిబ్బందికి సూచించారు. నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు అందేలా చూడాలని, సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని హౌసింగ్ పీడీకి దిశానిర్దేశం చేశారు. ఎరువుల దుకాణాల్లో స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలన్నారు. అలాగే, ప్రతి కుటుంబానికి రేషన్ బియ్యం అందేలా పర్యవేక్షి ంచాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాధికారి రేణుకా దేవి, జిల్లా వ్యవసాయ అధికారి రాజా రత్నం, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సోమలింగం మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సర్కారు రహదారికి ఎసరు

**మహేశ్వరం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** ప్రభుత్వ స్థలాలను, సామాన్య ప్రజలు నడిచే దారులను కాపాడాల్సిన అధికారులే కళ్లు మూసుకుంటే.. రాజకీయ అండదండలు ఉన్న నేతలు దేనికైనా సిద్ధమంటున్నారు. మహేశ్వరం పట్టణ కేంద్రంలో ప్రధాన రహదారిపైనే ఒక నాయకుడు రాత్రికి రాత్రే కబ్జాకు పాల్పడి సిమెంటు రోడ్డుపై మెట్లు నిర్మించడం స్థానికంగా కలకలం రేపుతోంది.

అధికార గర్వంతో అడ్డగోలు కబ్జా!

మహేశ్వరం పట్టణ కేంద్రంలోని ప్రధాన సిసి రోడ్డుపై బిఆర్ఎస్ నాయకుడొకరు అక్రమ నిర్మాణానికి తెరలేపారు. గత 20 సంవత్సరాలుగా ఎస్సీ కాలనీతోపాటు గంగపుత్ర బస్తీ వాసులకు ఇదే ప్రధాన దారి. అయితే, ఇటీవల తన పార్టీకి చెందిన వ్యక్తి గ్రామ సర్పంచ్‌గా గెలవడంతో తనను అడ్డుకునే వారే లేరనే ధీమాతో, రోడ్డుపైకి మెట్లు నిర్మించి ప్రజలు రాకపోకలు చేసే దారిని ఇరుకుగా మార్చేశారు. గతంలో ఈ రోడ్డుపై చెట్లు నాటడానికి ప్రయత్నించగా, బస్తీ వాసులు వాటిని తొలగించారు.

ప్రమాదాల నిలయంగా ప్రధాన రహదారి

ఈ రోడ్డు మార్గంలో ఇప్పటికే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, గతంలో ఎందరో గాయపడి ఆసుపత్రి పాలయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని నెలలుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని అధికారులు, ఇప్పుడు ఏకంగా రోడ్డుపై మెట్లు కడుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



**రాత్రికి రాత్రే సిసి రోడ్డు కబ్జా**

**అక్రమంగా మెట్లు నిర్మించి అరాచకం**

**అధికారుల మౌనంపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం**

**తొలగించకపోతే కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక**

**మెట్లు తొలగిస్తాం: సర్పంచ్**

**కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తాం : కాంగ్రెస్ హెచ్చరిక**

ఈ అక్రమ కబ్జాపై కాంగ్రెస్ నాయకులు బంగరిగల్ల లాజర్, కాకి ఈశ్వర్ ముదిరాజ్ తదితరులు ఎంపీడీవో శైలజారెడ్డికి, మండల పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. 30 ఏళ్లుగా ఉన్న రోడ్డును తన సొంత ఆస్తిగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్న బాలయ్యపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలయ్యకు అసలు ఎన్ని గజాల స్థలం ఉందో విచారణ జరపాలని, విధుల్లో నిరక్ష ్యం వహిస్తున్న అధికారులపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన చేపడతామని హెచ్చరించారు.

**చర్యలు తీసుకుంటాం : సర్పంచ్**

దీనిపై స్పందించిన సర్పంచ్ నవీన్, కార్యదర్శి సుజాత, సిబ్బందిని పంపి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

## మహేశ్వరంలో ముందస్తు వ్యూహం

### రానున్న ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ పావులు

### ప్రత్యర్థి పార్టీలకు మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ షాక్

**మహేశ్వరం, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో పంచాయతీలపై పట్టు చిక్కించుకోలేకపోయిన కాంగ్రెస్ భవిష్యత్‌లో తన సత్తా నిరూపించుకోవటాకి అడుగులు వేస్తోంది. పంచాయతీ ఫలితాలను గుణపాఠాలుగా చేసుకుని పార్టీకి సంబంధించి క్షేత్రస్థాయిలో లోపాలపై దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రానున్న మండల పరిషత్, జిల్లాపరిషత్ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ ఆధిపత్యం సాధించటమే లక్ష ్యంగా పార్టీ వ్యూహకర్తలు అడుగులు వేస్తున్నారు. నియోజకవర్గ ఇంచార్జీ, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్ఆర్) నేతృత్వంలో పార్టీ యంత్రాంగం ఇప్పటికే ప్రజాక్షేత్రంలోకి వెళ్లింది. గత 15 రోజులుగా నియోజకవర్గంలో పర్యటిస్తూ, ప్రత్యర్థి పార్టీలకు ధీటుగా కార్యకర్తలను సమాయత్తం చేస్తున్నారు.

**వలసల జోరు..**

ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఇతర పార్టీల నుంచి కీలక నేతలను కాంగ్రెస్‌లోకి రప్పించడంలో కేఎల్ఆర్ సఫలీకృతమవుతున్నారు. బుధవారం ఆర్కేపురం డివిజన్‌లో బీజేపీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, మాజీ వార్డు సభ్యుడు గనగంటి రమేశ్ గౌడ్, ఎన్టీఆర్ నగర్ ఫేజ్2 అధ్యక్షుడు క్రరె రవి తమ అనుచరులతో కలిసి పార్టీలో చేరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై తాము పార్టీలో చేరుతున్నట్లు వారు ప్రకటించారు.



మాజీ ఎమ్మెల్యే కెఎల్ఆర్ సమక్షంలో కాగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ నేతలు

**అభ్యర్థుల ఎంపికకూ కసరత్తు**

శంషాబాద్ జోన్ పరిధిలో కొత్తగా ఏర్పడిన 17 డివిజన్లలో కాంగ్రెస్ విజయం సాధించేందుకు కేఎల్ఆర్ ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. సామాజిక సమీకరణాలను బేరీజు వేస్తూ ఎస్సీ, బీసీ, ఎస్టీ, ఓసీ అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు కసరత్తు చేస్తున్నారు. టికెట్ దక్కని వారికి ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల ద్వారా తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇస్తూ, నాయకుల మధ్య ఎలాంటి విభేదాలు లేకుండా సమన్వయం చేస్తున్నారు. రెండు నెలల క్రితం పార్టీని వీడి జాగృతిలోకి వెళ్లిన అందుగుల సత్యనారాయణ తిరిగి కాంగ్రెస్‌లోకి రావడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. మొత్తానికి మహేశ్వరంలో పట్టు సాధించేందుకు కాంగ్రెస్ అనుసరిస్తున్న ఈ ముందస్తు వ్యూహం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.





మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్‌తో కలిసి ఆమనగల్లులో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## ఆమనగల్లుకు మహార్దశ

**శిక్షణ రంగంలో సరికొత్త అధ్యాయం!**

### 125 ఎకరాల్లో పోలీస్ బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్

### విద్యా హబ్‌గా ఏర్పాటుకూ వేగంగా చర్యలు

**ఆమనగల్లు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీస్ శాఖ తన అదనపు బలాన్ని పెంచుకుంటున్న నేపథ్యంలో, ఆమనగల్లు ప్రాంతం భవిష్యత్తులో కీలక శిక్షణ కేంద్రంగా మారబోతోంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన పోలీస్ బెటాలియన్ ట్రైనింగ్ సెంటర్‌ను ఆమనగల్లుకు మంజూరు చేయడంతో ఈ ప్రాంత అభివృద్ధికి కొత్త రెక్కలు వచ్చినట్లయింది.

ఈ భారీ ప్రాజెక్టు కోసం సుమారు 125 ఎకరాల ప్రభుత్వ స్థలం అవసరమని గుర్తించారు. ఇందుకు సంబంధించి బుధవారం స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, చైర్మన్ పత్యనాయక్ మరియు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి విస్తృతంగా పర్యటించి పలు భూము లను పరిశీలించారు. తహశీల్దార్ ఫారూఖ్ హుస్సేన్ అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల వివరాలను వెల్లడించారు.

**ఎండలను సైతం లెక్కచేయకుండా...**

తీవ్రమైన ఎండలను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్యే మరియు అధికారులు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముర్తూజపల్లి గ్రామం, సూర్యలక్షీ ్మ కాటన్ మిల్లు పరిసరాలు, ఫుడ్ ల్యాండ్ హోటల్ సమీపంలోని గుట్టలు, మేడిగడ్డ, మంగళపల్లి మరియు చెన్నకేశవ కాలనీ ప్రాంతాల్లోని భూములను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏ ప్రాజెక్టుకు ఎన్ని ఎకరాలు కావాలి? ఏ కార్యా లయానికి ఏ స్థలం అనుకూలంగా ఉంటుంది? అనే అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

**విద్యా, పరిపాలనా హబ్‌గా మార్పు**

కేవలం పోలీస్ శిక్షణ కేంద్రమే కాకుండా, ఆమనగల్లును ఒక విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. స్కిల్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కళాశాల, జూనియర్, సీనియర్ కళాశాలల ఏర్పాటు కోసం స్థలాలను ఖరారు చేసే పనిలో అధికారులు ఉన్నారు. డివిజన్ స్థాయి కార్యాలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాలను కూడా ఈ పర్యటనలో పరిశీలించారు.

ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మండల పరిషత్ కార్యాలయం చుట్టూ ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ఉన్న అవకాశాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని, అభివృద్ధిలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. పోలీస్ బెటాలియన్ ఏర్పాటు వార్తతో స్థానిక ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## బాకారంలో వైభవంగా హనుమాన్ జాతర

## మత్తు వదిలించండి

### మహేశ్వరం మండలంలో గంజాయి వాడకం పెరుగుతోంది

### నూతన సిఐ రాఘవేందర్ రెడ్డికి స్థానిక పెద్దల ఫిర్యాదు

2





# ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 1, ప్రభాతవార్త** రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండ జాగ్రత్తలు తీసుకోవాలని, ఎండలో పనిచేసేవారు సూర్య కిరణాలు తాకే స్థలంలో నివారణకు చర్యలు తీసుకునే విధంగా తగుచర్యలు చేపట్టాలని మేడ్చల్ జిల్లాకలెక్టర్ మనుచౌదరి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల ప్రభావం వల్ల సాధారణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతూ, తీవ్రమైన వేడిమి తో కూడిన ఎండలు ఉన్నందున ప్రజలు తప్పని సరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మధ్యాహ్నం సమయంలో వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని, ఒక వేళ బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ ధరించటం, తువ్వాలు చుట్టుకోవటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాధారణ సమయాలకంటే వేసవిలో ఎక్కువ మోతాదులో ద్రవ పదార్థాలు తీసుకోవాని, తేలిక పాటి కాటన్ వస్త్రాలు ధరించటం వంటివి చేయాలని, త్వరగా వడదెబ్బకు లోనయ్యే స్వభావం కలిగిన వారు విధిగా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. వృద్ధులు, చిన్నారుల విషయాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యాలయాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు, సముదాయాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వేసవి తీవ్రత వల్ల వడదెబ్బకు లోనుకాకుండ



మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి దృశ్యం

తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. వడదెబ్బకు గురికాకుండ ఉండేందుకు కూడళ్ల దగ్గర, పార్కుల దగ్గర వంటి స్థలాల్లో చలివేంద్రాలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలని సూచించారు. త్రాగునీటిని, చలివేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లును యూపిహెచ్‌సి, పిహెచ్‌సి కేంద్రాలకు ఎఎన్ఎం, ఆశావర్కర్లతో పంపిణీ చేయించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారికి శీతల పానీయాలు కాకుండ మంచినీళ్లు, ఓఆర్ఎస్ కలిపిన నీళ్లు వెంటనే త్రాగించాలని, నీడ ఉండే ప్రదేశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఉండే ప్రదేశాల్లో నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మూగ జీవాలకు, పక్షులకు మంచినీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు.

# ఐపిఎల్ బెట్టింగులకు పాల్పడితే కఠిన చర్యలు

**మోమిన్‌పేట్, ఎప్రిల్ 1, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్, మర్పల్లి, నవాబ్‌పేట్ మండలాల సంబంధించి గ్రామాలలో ఎవరైనా ఐపీఎల్ బెట్టింగులకు సంబంధించిన చట్ట విరుద్ధ కార్యకలాపాలు జరగకుండా నివారించేందుకు ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. బుధవారం విలేకర్ల సమావేశంలో సీఐ వెంకట్ మాట్లాడుతూ ఐపీఎల్ లేదా ఇతర క్రీడలపై బెట్టింగ్ చేయడం చట్ట విరుద్ధం, ఎవరైనా ఇటువంటి అక్రమ కలాపాల్లో పాల్గొంటే, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, కాబట్టి ప్రజలు ఇలాంటి కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఎవరైనా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లైతే వెంటనే పోలీసులకు సమాచారం డయల్ 100, సీఐపి మోమిన్‌పేట్ 8712670036కు సమాచారం అందించాలని ఆయన కోరారు. ఇలాంటి సమాచారం ఇచ్చిన వారి యొక్క వివరాలు గోప్యంగా ఉంచబడునని అన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న సిఐ వెంకట్.

# యువకుడు అనుమానాస్పద మృతి

**ప్రేమ వ్యవహారం నేపథ్యంలో విషాదం**

**జవహర్ నగర్, ఏప్రిల్ 1,ప్రభాత వార్త:** మెడ్చల్ జిల్లాలోని కాప్రా మండలం మల్లికార్జున కాలనీలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, శ్రీమతి పాంపరి పద్మ గారి కుమారుడు పాంపరి అరవింద్ (24), రాపిడో డ్రైవర్‌గా పనిచేస్తూ, గత ఐదు సంవత్సరాలుగా తమ బంధువైన యువతి చింతల శిరీషతో ప్రేమలో ఉన్నాడు. ఈ ప్రేమ వ్యవహారం కుటుంబ సభ్యులకు తెలిసిన తరువాత తరచూ ఇంట్లో వివాదాలు జరుగుతూ వచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 31 మార్చి 2026 ఉదయం అరవింద్ పని కోసం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం తన తల్లి ఫోన్ చేయగా, తర్వాత మాట్లాడతానని చెప్పి కాల్ ముగించాడు. ఆ రాత్రి కుటుంబ సభ్యులతో వీడియో కాల్‌లో కూడా పాల్గొన్నాడు. అయితే 1 ఏప్రిల్ 2026 తెల్లవారుజామున సుమారు 2:30 గంటల సమయంలో, అరవింద్ గది తలుపు కొద్దిగా తెరిచి ఉండటాన్ని గమనించిన అతని తండ్రి గదిలోకి వెళ్లి చూడగా, అరవింద్ చీరతో ఇనుప రాడ్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే అతన్ని కిందకు దించినప్పటికీ, అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రేమ వ్యవహారం కారణంగానే ఈ ఘటన జరిగి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## హస్నాబాద్ పాఠశాలలో
# స్వయం పరిపాలన దినోత్సవం

**కొడంగల్,ఏప్రిల్ 1,ప్రభాతవార్త:** దుద్యాల మండల పరిధిలోని హస్నాబాద్ ఎంపీయుపిఎస్(ఉర్దూ మీడియం) పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వమించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు చక్కటి బోధనతో అలరించారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులు..వారికి పరిపాలన పట్ల అవగాహన ఉంటేనే దేశ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హస్నాబాద్ విద్యార్థులు నిరూపించారు. డీఈఓగా ఎంఈఓగా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడి వంటి పాత్రలను పోషించి అందరినీ ఆశ్చర్య పరిచారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాలిబ్ అహ్మద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్య క్రమంలో ఎంఈఓ రాంరెడ్డి మాట్లా డుతూ నాయకత్వ లక్షణాలకు ఇది తొలిమెట్టని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను వెలికి తీయడానికి ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంపెక్స్ హెడ్మాస్టర్ నర్సిములు, పీఆర్టీయూ కొడంగల్ మండల శాఖ అధ్యక్షులు అబ్దుల్ హక్, ప్రధాన కార్యదర్శి దినేష్‌సింగ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్. రత్నకళ, అబ్దుల్ సలాంలతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వయం పరిపాలనలో పాల్గొన్న విద్యార్థులు

# దశదినకర్మలో పాల్గొన్న పట్నం మహేందర్ రెడ్డి

**చేవెళ్ల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి మాతృమూర్తి చంద్రకళ దశదినకర్మలో శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రకళ చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించి తన ప్రగాఢ సాను భూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిరుపతి రెడ్డి, దయాకర్ రెడ్డి, తాండూర్ నేత అబ్దుల్ రావూఫ్, వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మసూద్ ఆయనతో ఉన్నారు.






## హనుమాన్ జయంతి సందర్భంగా..
# 24 గంటలు వైన్ షాపులు బంద్

**చేవెళ్ల, ఏప్రిల్ 1 ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి సందర్భంగా ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ స్టేట్ ఎక్సైజ్ యాక్ట్, 1968 లోని సెక్షన్ 20 ప్రకారం, 02.04.2026 ఉదయం 6.00 గంటల నుండి 03.04.2026 ఉదయం 6.00 గంటల వరకు కమిషనరేట్ పరిధిలోని అన్ని వైన్ షాపులు, కల్లు దుకాణాలు (టాడీ షాప్స్), బార్లు మరియు రెస్టారెంట్లలోని బార్లు మూసివేయాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి. అయితే, స్టార్ హోటళ్లు మరియు రిజిస్టర్డ్ క్లబ్‌లకు ఈ నిబంధన నుండి మినహాయింపు కల్పించబడింది. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# నేడు శోభాయాత్ర..

**చేవెళ్ల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** వీర హనుమాన్ విజయ యాత్ర సందర్భంగా గురువారం జరగబోయే శోభయాత్ర రచ్చబండ నుండి గుండం దగ్గర ఉన్న హనుమాన్ దేవాలయం వరకు నిర్వహించబడుతుందని విశ్వహిందూ పరిషత్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలో సమావేశమై యాత్రకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్య క్రమానికి గ్రామ పెద్దలు హిందూ బంధువులు సోదరీ సోదరీమణులు అందరూ ఈ శోభాయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని ఈ యొక్క శోభాయాత్రని విజయవంతం చేయగలరని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా విశ్వహిందూ పరిషత్ ధర్మప్రచార చిలుకూరు శ్రీనివాస్, చేవెళ్ల మండల్ ధర్మ ప్రచార వ రాఘవేంద్ర చారి, చేవెళ్ల మండల్ బజరంగ్ దళ్ ప్రముఖ అనిల్ కుమార్ ముదిరాజ్, వెంకటరెడ్డి , విట్టలయ్య , శాంతయ్య ,వెంకటేశ్వరరావు ,తోట మహేష్ రెడ్డి, మాణిక్యం, మంగలి రమేష్ , నక్క మహేష్ , తదితరులు పాల్గొన్నారు .



సమావేశమైన వీహెచ్పీ నాయకులు






# సొమ్మొక్కరిదైతే సోకొక్కరిదిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**పాదయాత్రలో నిలదీసిన బిజెపి నాయకులు**

**పూడూరు, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకే భారతీయ జనతాపార్టీ పాదయాత్రచేపట్టిందని జిల్లా బిజెపి నాయకులు రమేష్‌కుమార్ స్పష్టంచేశారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే గుంతలమయమైన ఆర్‌అండ్‌బి,పంచాయతీరాజ్ రోడ్ల దుస్థితికి నిరసనగా బుధవారం మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు టి రాఘవేందర్ అధ్వర్యంలో లాల్‌పహడ్-అంగడి చిట్టంపల్లి ఆర్‌అండ్‌బి రహదారిపై పార్టీ నాయకులతో కలిసి తుర్కఎన్కెపల్లినుండి అంగడి చిట్టంపల్లిగేట్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి నిర్మాణంకోసం కేంద్రం నిధులు మంజూరిచేస్తే తానే చేయిస్తున్నట్లు జబ్బలు చర్చుకునే స్థానిక ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి లాల్‌పహడ్-అంగడి చిట్టంపల్లి ఆర్‌అండ్‌బి రహదారితోపాటు గ్రామాల్లోకి వెళ్లే గుంతలమయమైన పంచాయతీరాజ్ రోడ్ల పున:నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని నిలదీశారు. గ్రామాల్లోని రోడ్లను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతిపత్రాన్ని ఇచ్చేందుకు వెళ్లిన బిజెపి కార్యకర్తలపై దాడిచేయడం పాలన చేతకాని తనానికి నిదర్శనమన్నారు. గ్రామాల అభివృద్ధికోసం పిఎం నరేంద్రమోదీ వేలాదికోట్ల నిధులను రాష్ట్రానికి మంజూరిచేస్తే, తామే రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు కేంద్రంనుండి ఒక్కపైసాకూడా రాలేదన్నట్లు కాంగ్రెస్‌నాయకులు అసెంబ్లీలో చిత్రీకరించి సొమ్మొక్కరిదైతే సోకొక్కరిది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. పాదయాత్ర మధ్యలో కంకల్‌నుండి మేడిపల్లికలాన్ వరకు జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు సధానందరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫిలింబోర్డు సభ్యులు మల్లేశంపటేల్, జిల్లా పార్టీ అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా పార్టీ నాయకులు కన్నెయ్యోల్ల రాజు, ముకుంద నాగేశ్వర్, నాగారం మల్లేశం ,పెంటయ్య గుప్త, శ్రీనివాస్‌చారి, వెంకటయ్య, అంజనేయులు, కె మల్లేష్, క్రిష్ణ, ప్రకాష్ ,మహేష్, పాండు, పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

**కళాశాల డైరక్టర్ దివ్య నల్ల**

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 1, ప్రభాత వార్త:** ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యతను పెంపోదించుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కళాశాల డైరక్టర్ దివ్య నల్ల అన్నారు. పోచారం డివిజన్ కాచవాని సింగారం పరిధిలోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఐఐఆర్ఎఐ 26 పారిశ్రామిక విద్యాసంస్థల సంయుక్త పరిశోధన సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల డైరక్టర్ దివ్యనల్ల, ప్రఖ్యాత సంస్థలు, , అశోక్ పంతం, మొహసిస్ ఖండే, భరత్‌కుమార్, శశాంక్ కూర, కె. సుమతి వంటి నిపుణులు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును తామే నిర్మించుకోవాలని అన్నారు. ఆంగ్లబాషపై పట్టు సాధించడం ద్వారా సాంకేతిక నైపుణ్యాన్ని ఆలవర్చుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వి. రమేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోమిన్‌పేట్‌లో ఎస్ఐఆర్ శిక్షణ శిబిరం

**ఎన్నికల సన్నద్ధతకు అధికారులకు మార్గదర్శకం**

**మోమిన్‌పేట్, ఏప్రిల్ 1, ప్రభాతవార్త:** మోమిన్‌పేట్ మండలంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ (సిస్టమెటిక్ ఇంటెన్సివ్ రివిజన్) శిక్షణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ శిబిరంలో నాయబ్ తహశీల్దార్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌లు (ఆర్ఐలు), బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) సూపర్వైజర్లు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో ట్రైనర్లు నరసింహ్మ రాజ్, నటరాజ్ ఎన్నికల ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో అనుసరించాల్సిన విధానాలు, బాధ్యతలు, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు మరియు వాటి పరిష్కార మార్గాలపై సవివరంగా అవగాహన కల్పించారు.






## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**చేవెళ్ల, ఏప్రిల్ 1, ప్రభాతవార్త :** సీఎం సహాయని ద్వారా మంజూరైన చెక్కులను చేవెళ్ళ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని చేవెళ్ళ , శంకర్ పల్లి, నవాబ్ పెట్ , మొయినాబాద్ , షాబాద్ మండలాల సంబంధించిన 65 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధిద్వారా మంజురైన ఆర్థిక సహాయం పేదల వరం అని తెలిపారు .వేలాది మంది పేద, మధ్య తరగతి ప్రజలకు యేటా సిఎం సహాయ నిధిద్వారా ఆర్థిక చేయూత నందించడం జరుగుతుందని తెలిపారు. నియోజక వర్గంలో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సిఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మాణయ్య , వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి షాబాద్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నయ్య , పోతుగల్ గ్రామ సర్పంచ్ నర్సింలు, దామర్లపల్లి మాజీ సర్పంచ్ బర్ల యాదయ్య , నవాబ్ పేట మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి , ప్రభాకర్ రెడ్డి, గణపురం ప్రసాద్ , సుభాష్ చంద్రబోస్ ,మాధవ రెడ్డి ,జైపాల్ రెడ్డి, దయానంద్ ,నరేందర్ ,రవీందర్ రెడ్డి ,అనంత రెడ్డి ,మద్దూరి మల్లేష్ ,గణేష్ గౌడ్ ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ రెడ్డి ,ప్రసాద్ గేట్ వనం పల్లి, ఆసిఫ్ , బందయ్య , బాలరాజు , సమీర్, ఆనందు, కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి ,కౌన్సిలర్ గీతా వనజాక్షి ,శివ ఎల్వర్తి , రంగా రెడ్డి ,రాజు చిలుకూరు, బాలకృష్ణ రెడ్డి , బిక్షపతి , సురేష్ పెద్ద మంగళారం , మల్లేష్ మాదరం, పాల్గొన్నారు.







